సీరియల్

అడుగు ముందుకు వేస్తే భస్మం

వసుంధర

(గత సంచిక తరువాయి)

ప్రెసిడెంటుకు పరిస్థితి అర్థమయింది. "చూడండి, నేను మీ శ్రేయోభిలాషిని. ఈ దెయ్యాల ఏర్పాటు నేను చేసిందేనని ఒప్పుకొంటున్నాను. కానీ యెందుకు? మీ ప్రాణాలు రక్షించడానికే—మీరు ముందడుగువేస్తే మీ ప్రాణాలకు ముప్పువస్తుందని నాకు తెలుసు."

గురువులు నమ్మనట్లు చూశాడు. "మీకూ నాకూ యే విశేషమైన పరిచయమూ లేదు. అటువంటప్పుడు మీకు నా మీద ఇంత జాలి ఎందుకు?"

"నాకు పరిచయస్థులతో నిమిత్తంలేదు. తెలిసి యెవరినీ ప్రమాదంలో ఇరికించలేను. ఆ ఆటవికులను చూడ టానికి వెళ్ళిన వారెవ్వరూ ఇంతవరకూ తిరిగి రాలేదు" అన్నాడు ప్రెసిడెంట్.

"ఆ భయం నాకుండాలి. మీకెందుకు? నా క్కావల సింది ఆటవికుల గూడేనికి దారి...." అన్నాడు గురువులు.

"నాకు తెలిస్తే ఎప్పుడో చెప్పేవాణ్ని...."

"మీకు తెలుసు. అయినా చెప్పడంలేదు. ఈ రోజు నేను ఈ ఊరిపెద్దలయిన మిగతా తొమ్మండుగురినీ కలుసుకో బోతున్నాను. మీలో కొందరికి ఆటవికుల గురించి తెలుసునని నాకు నమ్మకంగా తెలిసింది. మీరేం చెప్పినా నేను నమ్మను. నేను కోరిన సమాచారం మీరు యిచ్చి తీరాలి" అన్నాడు గురువులు. అతని కంఠంలో తీవ్రత ధ్వనించింది.

"మీ మాట మీదే అయినప్పుడు నేను చేయగలిగిం దేముంది. కుతూహలం కొద్దీ అడుగుతున్నాను. మీరు కోరిన సమాచారం లభించకపోతే ఏం చేద్దామనుకుంటు న్నారు? ఏం చేయగల మనుకుంటున్నారు?" అన్నాడు ప్రెసిడెంటు. ఆ కంఠంలో హేళనవుంది.

"నేనేం చేసేదీ మాటలతో చెప్పను. కళ్ళతో చూస్తారు. ఇది మీకు నా హెచ్చరిక—" అన్నాడు గురువులు.

* * *

"మీతో ఒక్కమాట చెప్పాలి" అన్నాడు రామం.

"ఏమిటది?" అన్నాడు ప్రెసిడెంటు. ఆయన ముఖంలో కుతూహలం లేదు.

"నేను గ్రామంనుంచి వెళ్ళిపోదామనుకున్నాను. కానీ గురువులు ఒప్పుకునేలా లేదు. మొదట్నించీ నాకీ ప్రయాణము ఇష్టంలేదు. అతను బెదిరించి బలవంతపెట్టి నన్ను తీసుకొచ్చాడు. ఇప్పుడు నేను వెనక్కి పోతానంటే నా ప్రాణాలు తీసేస్తాడు. మీ హెచ్చరికలు వింటూంటే నాకు చాలా భయంగావుంది. ప్రతిక్షణం బలుసాకైనా తినవచ్చంటూను" అన్నాడు రామం.

"ఇదంతా నాకు ఎందుకు చెబుతున్నట్లు?"

"గురువులు ప్రమాదకరమైన మనిషి. నయాన అతణ్ని లొంగదీయడం కష్టం. ఒక్కసారిగా వెయ్యిమందికిసమాధానం చెప్పగలడు. అతన్ని మోసంతోనే జయించాలి" అన్నాడు రామం.

ప్రెసిడెంటులో రవంత ఆసక్తి కలిగింది—"ఎవరీ గురువులు?"

ఆరితేరిన గజదొంగ. పేరుపడిన హంతకుడు. చుట్టుముట్టిన పోలీసుల మీదనుంచి గెంతి వాళ్ళ జీపులోనే పారిపోయాడు. ఆ తర్వాత దురదృష్టంకొద్దీ యాక్సిడెంటుకు గురై పోలీసుల చేతిలోపడ్డాడు. జైల్లో పెట్టారు. జైల్లోంచి తప్పించుకుపోయాడు. బలవంతంగా మా ఇంట్లో ఆశ్రయం తీసుకున్నాడు. తనకొక నిధి రహస్యం తెలిసిందనీ దాన్ని సాధించడానికి తనతో తోడు కావాలనీ బలవంతంగా నన్ను తీసుకువచ్చాడు. ఇంతవరకూ యితడిని వదిలించుకునే అవకాశం నాకు రాలేదు" అని ఆగాడు రామం.

ప్రెసిడెంటు ముఖంలో కుతూహలం పెరిగింది"అయితే

చాలా ఘటికుడన్న మాట! ఏంచేస్తే యితగాడి పీడ వదులుంది....?"

"చాలా సింపుల్. ఇతగాడిక్కడున్నట్లు పోలీసులకు సమాచారం అందించారంటే వాళ్ళిక్కడికి వచ్చి ఋణాల మీద ఇతణ్ణి అరెస్ట్ చేసి తీసుకుపోతారు. ఎటొచ్చీ పోలీసులు వస్తున్నట్లు గురువులుకు ముందుగా తెలియ కూడదు. అతను నిద్రపోతున్న సమయంలో చడీ చప్పుడూ లేకుండా వాళ్ళు రావాలి...."

ప్రెసిడెంటు అయిష్టంగా "పోలీసుల్నిక్కడికి పిలవడం నా కిష్టముండదు" అన్నాడు.

"కానీ తప్పదు. మీకూ నాకూ కూడా ఇతగాడి పీడ వదులుంది. మీకు నమ్మకమైన మనిషిద్వారా పోలీసులకు కబురుపెట్టండి" అన్నాడు రామం.

"అందుకు ఒకరోజు ఆగాలి. ఈలోగా నేను కొన్ని ఏర్పాట్లు చేసుకోవాలి."

"అలాగే! కానీ ఆలస్యం అమృతం విషం."

ప్రెసిడెంటు అనుమానంగా రామంవంక చూసి "మీ మాటలు నేను నమ్మవచ్చా?" అన్నాడు.

"ఎందుకలా అనుకుంటున్నారు?" అన్నాడు రామం ఆశ్చర్యంగా.

"గురువులు చాలా తెలివైనవాడిలా కనబడుతున్నాడు. మీకులాంటి నమ్మకద్రోహిని తనకు తోడుగా తెచ్చు కుంటాడా అని ఆలోచిస్తున్నాను."

"గురువులుకు తన శక్తి సామర్థ్యాలమీద విపరీతమైన నమ్మకం. అదే గర్వం కూడా. ఆ గర్వమే అతని పతనానికి దారితీస్తుంది" అన్నాడు రామం.

* * *

గురువులు ఊరి పెద్దలందర్నీ కలిశాడు. అంతరూ తమకు ఏ నిధి గురించీ తెలియదని బుకాయించారు. అతను తను ప్రెసిడెంటును ఏ విధంగా హెచ్చరించాడో చెప్పి "మీరంతా ఆయనతో సంప్రదించి ఏం చేయాలో నిర్ణయించుకోండి. ఎంతో వ్యవధి లేదు" అన్నాడు.

తర్వాత అతను శ్రామిక జనాన్ని కలిశాడు. ఊరి పెద్దలమీద వారిలో ఎవ్వరికీ యిష్టంలేదని గ్రహించాడు. అక్కడి శ్రామికులందరికీ దుర్గయ్యే నాయకుడున్నాడు. అతడు గురువులుతో మాట్లాడేడు.

"కష్టజీవుల కష్టసుఖాలు గమనించి రమ్మనమని ప్రభుత్వం నన్ను పంపింది. దుర్మార్గులను శిక్షించడానికి నాకు సర్వాధికారాలూ యిచ్చింది. ఈ పరిస్థితి చూస్తూంటే నాకు కడుపు తరుక్కుపోతోంది. కొద్దిమంది కడుపులో చల్లకదలకుండా కూర్చుని సర్వసుఖాలూ అనుభవిస్తూంటే రెక్కలు ముక్కలు చేసుకునే శ్రామికజీవులు కడుపు నిండా తిండైనా దొరక్క అవస్థపడుతున్నారు. ఇందుకు కారణమేమిటి?" అన్నాడు గురువులు తీవ్రంగా. ఎంతో ఆవేదన ననుభవిస్తున్న అనుభూతి నతడు ముఖంలో ప్రదర్శించాడు.

"కారణం వేరే చెప్పాలా-దొరలు మమ్మల్ని దోచుకుంటున్నారు. మేమేమీ చెయ్యలేక నిస్సహాయంగా వూరుకున్నాము" అన్నాడు దుర్గయ్య.

"తిరగబడలేకపోయారా?"

"శక్తి చాలదు. వాళ్ళదగ్గర డబ్బుంది. మనుషులున్నారు. పలుకుబడివుంది. ఒకటేమిటి అన్నీ వున్నాయి. వాళ్ళనెదిర్చి మేము నిలబడలేము" అన్నాడు దుర్గయ్య.

దుర్గయ్య చెప్పిన కథలు వింటూంటే గురువులుకూడా

ఆవేశం కలిగింది.

ఒక పర్యాయం డాక్టరొకాయన శ్రామికుడింటికి వైద్యానికి వచ్చి శ్రామికుడి భార్యను బలవంతం చేయబోయాడు. సమయానికి ఎవ్వరో కలగజేసుకున్నారు. ఆ శ్రామికుడు తర్వాత డాక్టర్ వద్దకు వెళ్ళి నానా దుర్భాషలూ ఆడాడు. డాక్టర్ ప్రెసిడెంటుకు జెప్పుకున్నాడు. ప్రెసిడెంటు అంతా విని "డాక్టర్ అంతపని చేస్తాడంటే నేను నమ్మలేకుండా వున్నాను. నీ పెళ్ళాం అబద్ధమాడదని నాకు నమ్మకం. దాన్ని తీసుకునిరా. అది చెబితే నీ మాటలు నమ్ముతాను. డాక్టర్ని శిక్షిస్తాను" అన్నాడు.

శ్రామికుడు సంతోషపడి భార్యను తీసుకుని ప్రెసిడెంటు ఇంటికి వెళ్ళాడు.

"ఏమే-నీ మొగుడు చెబుతున్నది నిజమేనాకి?" అనడిగాడు ప్రెసిడెంటు.

"అవునండి" అంది శ్రామికుడి భార్య.

"నువ్వేమంటావయ్యా డాక్టరూ!" అన్నాడు ప్రెసిడెంటు.

"మీ మాటలు వినడం మినహా నాకింకేమీ తెలియదు" అన్నాడు డాక్టరు.

"ఆయన ప్రాణాలు నిలబెట్టే డాక్టరే! డాక్టరంటే దేవుడు. దేవుడు స్వయంగా వచ్చి చేతులు పట్టుకుంటే కాదంటావా-ఇప్పటికే చాలా పాపం వచ్చేసుంటుంది. వెళ్ళి ఆయన కాళ్ళట్టుకుని పొరపాటొప్పేసుకో"అన్నాడు ప్రెసిడెంటు.

శ్రామికుడు నివ్వెరబోయాడు ఈతీర్పుకు. ప్రెసిడెంటు చూస్తూండగా డాక్టరు శ్రామికుడి భార్యను బలవంతంగా ఓ గదిలోకి లాక్కుని వెళ్ళిపోయాడు. శ్రామికుడి పక్క-

ఇద్దరు బలాఢ్యులు నిలబడ్డారు.

"మా మో చేతి నీళ్ళు త్రాగి బ్రతికే వెధవలు, మాతో సమంగా ఉండాలనుకుంటున్నారా? మా నీతి వేరు. మీ నీతి వేరు. ఈసారి కింతటితో సరిపెట్టాను. ఇంకెప్పుడైనా ఊరిపెద్దల్ని తప్పుపట్టారంటే నీ రక్తం కళ్ళజూస్తాను" అన్నాడు ప్రెసిడెంటు.

శ్రామికుడి భార్య ఆ తర్వాత ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. కానీ ఆ శ్రామికుడు ఆమెను దయతో ఏలుకున్నాడు. ఎప్పటికైనా పగతీర్చుకోవాలని చూస్తున్నాడు కానీ ఆ అవకాశం ఈ జన్మకు రాకపోవచ్చు.

"ఇలాంటి కథలు బోలెడున్నాయి బాబూ-గుర్తు తెచ్చుకుంటూంటే మా రక్తం మరిగిపోతూంటుంది" అన్నాడు దుర్గయ్య.

"నేనా డాక్టర్ని చంపేస్తే యెలావుంటుంది మీకు?"

"సంతోషంతో పండుగ జరుపుకుంటాం" అన్నాడు దుర్గయ్య.

"ఆ డాక్టర్ పెళ్ళాన్నవమానిస్తే."

దుర్గయ్య ఉత్సాహంగా ఈల వేశాడు.

"చూడు దుర్గయ్యా! మీ రుత్సాహంగా వుండండి. కొద్దిరోజుల్లోనే మీ ఆర్థికపరిస్థితి బాగుపడే యేర్పాటు నేను చేస్తాను. నేనెవ్వరికీ ప్రమాదం తలపెట్టను. ప్రెసిడెంటుకీ, పెద్దలకీ యెదురు తిరగడంవల్ల నాకు చాలా ప్రమాదముంటుంది. ప్రెసిడెంటు తన తెలివి తేటలన్నింటినీ వుపయోగించి మిమ్మల్ని నాపైన ఉసిగొల్పటానికి చూస్తాడు. మీరంతా నా పక్షానవుంటే చాలు. ప్రెసిడెంటు మనుషుల సంగతి నేను చూసుకుంటాను."

గురువులు అక్కణ్ణించి కదిలాడు. తన పథకం తప్పక

ఫలిస్తుందని అతనికి ఆశగా వుంది. ఊళ్ళోని గ్రామిక జనానికి ప్రెసిడెంటుపట్ల సుహృద్భావం లేకపోవడం తన అదృష్టం!

*　　　*　　　*

"పోలీస్ జీపు వచ్చిందండి" అన్నాడు పుల్లయ్య.

"ఎక్కడున్నారు పోలీసులు?" అన్నాడు ప్రెసిడెంటు.

"ఊరిపొలిమేరలో వున్నారండి" అన్నాడు పుల్లయ్య.

"సరేలే-నువ్వెళ్ళి అరుగుమీద కూర్చో—" అన్నాడు ప్రెసిడెంటు. ఆయన నెమ్మదిగా రామం, గురువులువున్న గది దగ్గరకు వెళ్ళాడు. గురువులు మంచంమీద కూర్చున్నాడు. వీపు గుమ్మంవైపుకు తిరిగివుంది. రామం మంచం మీద పడుకుని వున్నాడు. అతను ప్రెసిడెంటును చూశాడు.

ప్రెసిడెంటు రామానికి సైగ చేశాడు. రామం నెమ్మదిగా మంచం దిగి గదిలోంచి బయటకు వచ్చాడు. ప్రెసిడెంటు అతన్ని మరికాస్త దూరంగా తీసుకొనిపోయి— "ఏం చేస్తున్నాడు గురువులు?" అనడిగాడు.

"ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు."

"మాకు రెండురోజులు గడువిచ్చాడుగా. అది తీరేక యేం చేయాలా అని ఆలోచిస్తూండి వుంటాడు. ఈలోగా అతగాడి రోజులు దగ్గరపడ్డాయి. పోలీసులు వచ్చారు. ఊరి పొలిమేరలో వున్నారు."

రామం కళ్ళు సంతోషంతో మెరిశాయి. తనకు గురువులు బాధ తప్పుతుంది. హాయిగా వెళ్ళి లలితను పెళ్ళి చేసుకోవచ్చు. సుఖ భోజనం చేయవచ్చు. "నన్నిప్పుడేం చేయమంటారు?"

"గురువులు తొందరగా నిద్రపోయే మార్గంచూడు" అన్నాడు ప్రెసిడెంటు.

"అదేమంత కష్టంకాదు. నిన్న రాత్రల్లా మెలకువగా వున్నాడు. ఈరోజు మధ్యాహ్నంకూడా నిద్రపోలేదు. నేను మెలకువగా వుంటాననిచెబితే ఇప్పుడు నిద్రపోతాడు. గురువులు నిద్రకుపక్రమిస్తే నేను సన్నగా ఈల వేస్తాను. అప్పుడు మీరు పోలీసులకోసం బయల్దేరవచ్చు" అన్నాడు రామం.

"కానీ-జాగ్రత్త! అతను చాలా ప్రమాదకరమయిన మనిషి."

"ఆ విషయం మీకంటే నాకే బాగా తెలుసు...." అన్నాడు రామం. తర్వాత అతను తనగదిలోకి వెళ్లాడు. గురువులింకా అలా కూర్చుని ఆలోచిస్తూనే వున్నాడు.

"ప్రెసిడెంటు పిలిచాడా?" అన్నాడు గురువులు.

రామం ఉలిక్కిపడ్డాడు. వీపు తనవైపు పెట్టివున్నా గురువులు తను గదిలోంచి బయటకు వెళ్ళడాన్నీ, తిరిగి రావడాన్నీ చప్పుడునుబట్టి గ్రహించాడన్న మాట!

"అవును-పిలిచాడు" అన్నాడు రామం.

"ఎందుకు?" అన్నాడు గురువులు.

"నీకు తర్వాత తెలుస్తుంది. ఒకరి పథకాలొకరికి చెప్పుకో వద్దన్నావుగా."

"వెరీగుడ్" అని నవ్వి గురువులు రామంవైపు తిరిగేడు. "నేను నీ గురించే ఆలోచిస్తున్నాను రామం! నువ్వు నాలా రఫ్ అండ్ టఫ్‌గా పెరిగిన వాడివి కావు. నా గురించి ఇక్కడ నాకులాంటి జీవితమే గడుపుతూ కష్టపడుతు న్నావు. నిన్ను నువ్వు రక్షించుకోగలవా అన్న అనుమానము కూడా నాకుంది. నిన్ను కాపాడుతానని మీ

తాతకు మాటిచ్చాను. కనీసం నిధి చేరే వరకయినా నిన్ను కాపాడటం నా బాధ్యత!"

"నా గురించి బెంగ పెట్టుకోకు. నన్ను నేను కాపాడుకోగలను. నీ సంగతి నువ్వు చూసుకుంటే చాలు. ఆరోగ్యాన్ని మనిద్దరిలో యెవ్వరూ అశ్రద్ధ చేయకూడదు. నిన్న రాత్రి ఈరోజు మధ్యాహ్నంకూడా నీకు సరయిన నిద్రలేదు. ఇప్పుడు నిద్రపోయావంటే నేను కాపలా వుంటాను. మనకేమీ భయంలేదు" అన్నాడు రామం. అతని కంఠం అప్రయత్నంగా వణికింది.

"అదిసరే- నాకూ నిద్ర వస్తోంది. నీకే ఆపద కలిగినా వెంటనే నన్ను లేపు. ఒక్క క్షణంకూడా జాప్యం చేయకు. ఈరోజు నాకు కాస్త గాఢనిద్రకూడా వచ్చేలాగుంది" అన్నాడు గురువులు. అంటూనే అతను లేచి వెళ్లి గది తలుపులు వేశాడు. దీపం ఆర్పాడు. మంచం మీద పడుకున్నాడు.

గురువులు గురక గదిలో ప్రతిధ్వనించసాగింది. రామం సన్నగా ఈల వేశాడు. గది కిటికీ దగ్గర నిలబడి వున్న ప్రెసిడెంటుకు ఆ ఈల వినబడింది. ఆయన ఉత్సాహంగా అక్కణ్నించి కదిలాడు.

రామం మెలకువగానే వుండి అంకెలు లెక్కపెట్టుకుంటున్నాడు. ఎప్పుడు పోలీసులు వస్తారా, తనకు గురువులు బాధ తప్పుతుందా అని అతను ఆలోచిస్తున్నాడు. ఆలోచిస్తూండగానే అతడికి మగతగా నిద్ర పట్టింది.

తనమీద ఏదో చిన్న రాయి పడ్డట్లనిపించి రామానికి మెలకువ వచ్చింది. ఒక్కనిమిషం కళ్ళు నులుముకున్నాక అతడికి తన పథకం గుర్తుకొచ్చింది. చటుక్కున గురువులు వంక చూశాడు. అతగాడి గురక గదిలో యింకా ప్రతి

ధ్వనిస్తోంది.

రామం మంచంమీంచి లేచాడు. కిటికీదగ్గర నీడలు అతనికి కనబడుతున్నాయి. ప్రెసిడెంటు పోలీసులతో వచ్చేశాడన్నమాట! గది తీయబోతూ రామం వణికాడు. తప్పు చేస్తున్నానేమో నన్నభావం లిప్తకాలం అతడికి కలిగింది. రామం గది తలుపులు తీశాడు.

ప్రెసిడెంటు, పోలీసులు చప్పుడు చెయ్యకుండా గదిలో ప్రవేశించారు. ప్రెసిడెంటు స్విచ్ నొక్కి దీపం వేశాడు. పోలీసులు గురువులు మంచాన్ని చుట్టుముట్టేరు. మొత్తం యెనమండుగురు వున్నారు.

గురువులు బోర్లా తిరిగి నిద్రపోతున్నాడు. అతనింకా గురక పెడుతూనే వున్నాడు.

పోలీసుల్లో ఒకడు వంగి గురువులు వీపుమీద తట్టాడు. గురువులు కదల్లేదు. అతని గురకకూడా ఆగలేదు. ఇంకో పోలీసు మరికాస్త గట్టిగా కుదిపాడు.

గురువులు గురక ఆగింది. ఓ చేయి కదిలింది. అతను చటుక్కున లేచికూర్చుని కళ్ళు నులుముకున్నాడు.

ఎనమండుగురు పోలీసులూ తుపాకులు సిద్ధం చేసుకున్నారు. కొద్దిగా వెనక్కి శ్శారు.

గురువులు పోలీసుల్ని చూసి గతుక్కుమన్నాడు. అప్రయత్నంగా అతడి దృష్టి రామంవైపుకు వెళ్ళింది. రామం తానేమీ యెరుగ నన్నట్లుగా తల అడ్డంగాతిప్పి, కంగారుగా, దీనంగా గురువులువంక చూశాడు. తర్వాత గురువులు ప్రెసిండెంటువంక చూశాడు. ప్రెసిడెంటు వస్తున్న నవ్వు నాపుకుంటున్నాడు. ముఖంలో గర్వం చాలా యెక్కువగా వుంది.

గురువులు పోలీసులవంక చూస్తున్నాడు. పోలీస్ ఇన్

స్పెక్టర్ గురువుల్ని పరీక్షగా గుచ్చిగుచ్చి చూస్తున్నాడు.

"ఏమిటిదంతా? పోలీసులెందుకొచ్చారు?" అన్నాడు గురువులు.

"ఎందుకొస్తారు పోలీసులు?" అన్నాడు ప్రెసిడెంటు.

పోలీసు ఇన్‌స్పెక్టర్ తన జేబులోంచి ఒకఫోటో తీసి గురువుల్నీ ఫోటోనూ మార్చిమార్చి చూస్తున్నాడు.

"ఏమిటిదంతా? నేనెవర్ననుకుంటున్నారు?" అంటూ గద్దించాడు గురువులు.

అది మేకపోతు గాంభీర్యంలా వున్నదనీ, గురువులు తప్పించుకు నేటందుకు దారి చూస్తున్నాడనీ ప్రెసిడెంటు గ్రహించాడు.

"నువ్వెవరివో యిక్కడ అందరికీ తెలుసు. అనవసరంగా గొంతు చించుకుని అరవకు. నీ ఆటకట్టింది" అన్నాడు ప్రెసిడెంటు.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఊరుకోమన్నట్లు ప్రెసిడెంటు భుజంతట్టి, గురువుల్ని సమీపించి ఎటెనన్షన్ నిలబడి సెల్యూట్ చేశాడు-"సార్, మీరిక్కడిలా....?" అని అర్థోక్తిగా ఆగిపోయాడు.

ప్రెసిడెంటు, రామం ప్రమాన్పడిపోయారు.

గురువులు యిబ్బందిగా మంచంమీంచి కదిలి "ఎలా గుర్తుపట్టావ్?" అన్నాడు.

"గుర్తుపట్టడానికేముంది సార్? మీరెంత గొప్పగా మేకప్ చేసుకున్నప్పటికీ చచ్చినమనిషి బ్రతికొచ్చాడనుకోంలేగదా-అదీకాక మీరు గురువులు వేషంలో వున్నట్లు నిన్ననే మాకు సమాచారమందింది!"

"ఏమిటీ__గురువులు చచ్చిపోయాడా?" అన్నాడు రామం ఆశ్చర్యంగా. తనకు తెలిసిన వివరాలనుబట్టి, యిది

ఏ మాత్రమూ నమ్మదగనిగా తోచలేదు రామానికి.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ నాలిక్కొరుచుకున్నాడు.

గురువులు నవ్వుతూ "ఫర్వాలేదు మిస్టర్ సురేష్— గురువులు చచ్చిపోయాడనీ కొన్ని కార్యాలు సాధించ డానికి ఒక పోలీసు అధికారి గురువులు రూపంలో తిరుగు తున్నాడనీ నీకు తెలిసిన విషయం ఇక్కడున్న వీళ్ళకు చెప్పినా యిబ్బందిలేదు. అది రహస్యంగానే వుంటుందని నీకు హామీ యిస్తున్నాను. ఎందుకంటే వీళ్ళంతా మన వాళ్ళే!" అన్నాడు.

"ఎవరు ఎవరైనప్పటికీ అది నేను దాచవలసిన రహస్యం. మీరెలాగూ చెప్పారు. అనవసరంగా మీకు శ్రమ యిచ్చినందుకు నన్ను మన్నించాలి. ఎప్పుడైనా మీకు యిబ్బంది కలిగితే కాకితో కబురు పంపితే వచ్చి వాల తాను. ప్రస్తుతానికి సెలవు తీసుకుంటాను. మీరు తల పెట్టిన కార్యం నిర్విఘ్నంగా నెరవేరగలదని ఆశి స్తున్నాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ సురేష్.

అతను తన బలగంతో బయటకు వెడుతూంటే ప్రెసి డెంటు అనుసరించి "పొరపాటయింది. ఈయన పోలీసు అధికారి అని నాకు తెలియలేదు" అన్నాడు.

సురేష్ నవ్వి "ఇది మన్నించదగ్గ పొరపాటే- తెలియక చేసిన తప్పుకు క్షమించడం న్యాయం. ఇప్పుడు నిజం తెలి సింది కాబట్టి ఇలాంటి పొరపాటు మళ్ళీ చేయకండి. తెలిసి చేసిన తప్పును మా డిపార్టుమెంటు చాలా సీరియస్‌గా తీసుకుంటుంది" అన్నాడు.

* * *

"నన్ను మన్నించు....ఇంతకాలం నువ్వొక సామాన్య మైన దొంగవనే అనుకుంటున్నాను. కానీ బాధ్యతగల

పోలీసాక్షీసరువని తెలుసుకోలేదు" అన్నాడు రామం.

గురువులు నవ్వి వూరుకున్నాడు.

"నీ పేరు తెలుసుకోవచ్చా?" అన్నాడు రామం.

"నా పేరు గురువులు. అక్షరాలా గురువులు. నాకు పోలీస్ డిపార్టుమెంటులో ఏ విధమైన సంబంధమూ లేదు. నేను దొంగను, హంతకుణ్ణి!" అన్నాడు గురువులు గర్వంగా నవ్వుతూ.

"అం టే?"

"రామం నీకు చాలా థాంక్స్! నీకు గుర్తున్నదే అనుకుంటాను. శ్రీకృష్ణపరమాత్మ మొదట్లో అన్నాడు—గంగాపురంలోకి ఏదో ఒక పర్యాయం పోలీసుల అవసరం తీసుకురావాలనీ-అది మనకెంతో ప్రయోజనకారి కాగలదనీ! ఆ సలహాను దృష్టిలో వుంచుకుని నువ్వు నాకు బాగా సహాకరించావు. పోలీసుల్ని పిలవమని నువ్వేగదా ప్రెసిడెంటుకు సలహా ఇచ్చావు" అన్నాడు గురువులు.

"అవును" అన్నాడు రామం తల వంచుకుని.

"రామం నీ పద్ధతిలో నువ్వు ప్రయత్నాలు చేస్తాననడం బాగానే ఉంది కానీ మరీ అంత గుంభన పనికిరాదయ్యా-నీకు శ్రీకృష్ణపరమాత్మపైన వున్న విశ్వాసం మెచ్చుకోదగ్గది. మన నాటకం బాగా రక్తికట్టింది. ప్రెసిడెంటు పోలీసులకోసం కబురుపెట్టిన మనిషిని ఊరి పొలిమేరలలో శ్రీకృష్ణపరమాత్మ కలుసుకుని, తప్పుదారి పట్టించి—తన మనుషుల్ని పోలీసులుగా పంపించాడన్న విషయాన్ని ప్రెసిడెంటు ఈ జన్మకు కనుక్కోలేడు" అన్నాడు గురువులు పకపకా నవ్వుతూ.

రామం బాగా ఆశ్చర్యపడ్డాడు కానీ పైకి తేలలేదు. తను ఏ ఉద్దేశ్యంతో గురువుల మీదికి పోలీసులనుసి

గోల్పోవాలనుకున్నా అది అతనికే మంచిచేసింది. తను మంచి చేయాలనే అలా చేశానని అతననుకుంటున్నాడు.

రామానికి తాతయ్య హెచ్చరికలోని అర్థం అప్పటికి తెలిసివచ్చింది. గురువుల్నించి తప్పించుకోవడం అంత సులభమైన పనికాదు. తన మెదడుకు బాగా పదును పెట్టాలి.

"మరి నువ్వు నీకు తెలియని పోలీస్ ఇన్‌స్పెక్టర్ని పేరు పెట్టి ఎలా పిలిచావు?" అనడిగాడు రామం.

"అది మన సంకేతం. శ్రీకృష్ణ మొదటి పర్యాయం పంపించే పోలీస్ ఇన్‌స్పెక్టర్ని సురేష్ అని పిలవడం, ఆ పిలుపుకు అతను రెస్పాన్సివ్వడమూ పరస్పరం గుర్తించుకునేలా చేస్తుంది."

రామం బాగా ఆశ్చర్యపడ్డాడు.

"ఎక్కువగా ఆలోచించకు. ఈ పూటకు యిద్దరం పడుకోవచ్చు. ఇంకే ప్రమాదమూ వుండదు. నువ్వు కూడా నిశ్చింతగా వుండు" అన్నాడు గురువులు.

ఇద్దరూ నిద్రకుపడ్డారు. రాత్రి ఏ సంఘటనలూ జరగ లేదు. ఇద్దరూ కూడా కాస్త పెందరాళే లేచారు. కాల కృత్యాలు తీర్చుకున్నారు.

గురువులు ప్రెసిడెంటును పిలిచి పలకరించాడు "నా సంగతి చాలా వరకూ అర్థమయిందనుకుంటాను. ఈ రాత్రితో మీకిచ్చిన గడువు అయిపోతోంది. బాగా ఆలోచించుకోండి."

"నాకు తెలిసింది నే నెప్పుడో చెప్పాను. ఇంక ఆలో చించవలసినదేమీ లేదు."

"అయితే ఒక పోలీసు అధికారిగా ఆజ్ఞాపిస్తున్నాను. ఈ రాత్రి మీ ఇంట్లోని పెద్దహాల్లో ఊరిపెద్దలందరూ

సమావేశం కావాలి. నేను చెప్పదల్చుకుందీ, చెయ్యదల్చుకుందీ అప్పుడు మీకు తెలియజేస్తాను" అన్నాడు గురువులు.

"దానికేం భాగ్యం .... అలాగే!" అన్నాడు ప్రెసిడెంటు.

తర్వాత గురువులు ఊళ్ళో పనుందని అక్కణ్ణించి వెళ్ళిపోయాడు. రామం మాత్రం అక్కడే వుండి పోయాడు.

"నీ మాట పట్టుకున్నందుకు నాకు మంచి పరాభవ మైందిలే. అయినా వాడి మనిషివని తెలిసుండీ నిన్ను నమ్మడం నా తెలివితక్కువ" అన్నాడు ప్రెసిడెంటు రామంవంక కసిగా చూస్తూ.

"నీ పరాభవానికి కారణం మీ తెలివితక్కువతనం. నేను కాదు" అన్నాడు రామం.

"ఆ మాటేకదా నేనూ ఒప్పుకున్నాను. నిన్ను నమ్మడం నా తెలివితక్కువే మరి!"

"నన్ను నమ్మడం కాదు" అని రామం నవ్వి "గురువులు పోలీసు అధికారి కాడు. నిన్న రాత్రి వచ్చింది పోలీసులూ కాదు. ఈ చుట్టుపక్కల మకాం పెట్టిన గురువులు మనుషులు. ఈ విషయం మీరు తెలుసుకోలేకపోయారు" అన్నాడు.

ప్రెసిడెంటు నోరావలించి "ఇదెలా సాధ్యం?" అన్నాడు.

"గురువులుకు చాలా సాధ్యపడతాయి. అతను సామాన్యుడు కాదని మీ కెప్పుడో చెప్పాను. పోలీసు డిపార్టుమెంటు అతని కోసం గాలిస్తూ ఏమీ చేయలేకపోతోంది. మీరూ, నేనూ ఎంత? అతగాడి మనుషులు ఈ గ్రామం చుట్టూ వలపన్ని వున్నారని నా గట్టి నమ్మకం. వాళ్ళను ఛేదించుమని అసలు పోలీసుల వద్దకు వెళ్ళడం యించు

మించు అసాధ్యం. ఇంకేమైనా వుపాయం పన్నాలి."

"నీకేదయినా తోస్తే చెప్పు" అన్నాడు ప్రెసిడెంటు.

"ఎలాగో అలా నన్నిక్కణ్ణించి తప్పించాలి మీరు. నేను బయటకు వెళ్ళానంటే మీకు చాలా సాయపడగల్గుతాను."

"నీ స్వార్థం నువ్వు చూసుకుంటున్నావ్. నువ్వు తప్పించుకుపోతే మళ్ళీ మమ్మల్ని పట్టించుకుంటావా?" అన్నాడు ప్రెసిడెంటు.

"అలా అయితే నిధి రహస్యం చెప్పక తప్పదు మీరు" అన్నాడు రామం.

"రహస్యం చెప్పడానికి నిధి అంటూ ఉండి ఏడిస్తే గదా!" అన్నాడు ప్రెసిడెంటు.

"అది గురువులూ, మీరూ చూసుకోవాల్సిన విషయం. ఇందులో నేను చేయగలిగిందేమీ లేదు" అన్నాడు రామం.

"నేనేం చేయాలో చెప్పు" అన్నాడు ప్రెసిడెంటు.

"నాకు ఆరోగ్యం బాగాలేదని చెబుతాను. డాక్టర్ని పిలిపించండి. ఆయన నన్ను పరీక్షించి నా పరిస్థితి తీవ్రంగా వుందని చెబుతాడు. మొదట నన్నాయన ఇంటికి తరలించండి. అక్కడో రెండురోజు లుంచుకొని రోగం అంతు బట్టడంలేదనీ పట్నం పంపాలనీ ఆయనంటాడు. నన్ను పట్నం పంపారంటే గురువులు పని అయిపోయినట్టే!" అన్నాడు రామం.

"గట్టి బుర్రేనయ్యా నీది!" అన్నాడు ప్రెసిడెంటు అభినందిస్తూ. "ఇందులో నీకూ ప్రమాదంలేదు, మాకూ ప్రమాదంలేదు. పని జరిగిందా సరేసరి. లేమా నష్టం లేదు. అలాగే చేస్తాను. కానీ నీ రోగం యెప్పుడు మొదలవుతుంది?" అన్నాడు ప్రెసిడెంటు.

"ఆలశ్యం, అమృతం, విషం....అన్నారు. ఈరాత్రి మీరంతా యెలాగూ మీటవుతున్నారు గదా! అదయిన కాస్సేపటికి నాకు కడుపునొప్పి వస్తుంది. బయట వాళ్ళను నమ్మించగల అతి తక్కువ జబ్బుల్లో అదొకటి!" అన్నాడు రామం.

"బాగా నేవుంది చూద్దాం ఈసారేమవుతుందో—" అన్నాడు ప్రెసిడెంటు.

* * *

"మీరంతా ఈ ఊరిపెద్దలు. ఈ ఊరికి మీ చేతనైన సహాయంచేస్తూ, ఫలితాల నందుకుంటూ జీవితం కొనసాగిస్తున్నారు. మీతో నాకేమీ శత్రుత్వంలేదు. ఒకపని గురించి నేనిక్కడకు వచ్చాను. అదేమిటో మీ అందరకు తెలుసు. నేను మీ అందరి సహకారం కోరుతున్నాను. అది నాకు లభించడంలేదు.

నేనెంత ప్రమాదకరమైన మనిషినో మీ రెవ్వరూ గుర్తించినట్లు లేదు. గుర్తించేలా చేయడంకూడా నా అభిలాష కాదు. కానీ తప్పేలా కనిపించడంలేదు. మీకు నేనిచ్చిన గడువు పూర్తికావస్తోంది. ఇప్పటికీ నే నడిగింది మీరు చెప్పని పక్షంలో తర్వాత జరిగే సంఘటనలకు బాధ్యత నాదికాదు. మీదే అవుతుంది" అన్నాడు గురువులు.

"ఏమిటీ బెదిరింపు. మేము నాగరిక ప్రపంచంలో వుంటున్నామా, అడవిలో వుంటున్నామా?" అన్నాడు కరణం.

"మీరున్నది నాగరిక ప్రపంచానికీ, అడవికీ మధ్యలో. మీ ప్రవర్తనకూడా మధ్యరకంగానే వుంటోంది. నాగ

రికులకున్న సౌఖ్యాలన్నీ అనుభవిస్తూనే తోటి మానవులను అనాగరికంగా హింసిస్తున్నారు.

మీ గురించి చాలా కథలు విన్నాను. మీలో వొక డాక్టరు వొక శ్రామికుడి భార్యను బలవంతంగా, మహా అవమానకరంగా అనుభవించి, అది తన హక్కుగా భావించాడు. మనసబుగారు జబ్బుతో బాధపడుతున్న ముసలాడి చేత గొడ్డు చాకిరీ చేయించుకొని వాడు చచ్చిపోతే ఆ పని వాడి కొడుకు చేత పూర్తి చేయించుకొని అప్పుడు శవాన్ని వాడికి అప్పగించాడు. చెప్పాలంటే యిలాంటి ఘోరాలు చాలా వున్నాయి. నేనిక్కడికి ఈ ఘోరాల నెదిరించడానికి రాలేదు. నా పనిమీద వచ్చాను. అనాగరికం గురించి మాట్లాడటానికి మీకు అర్హత లేదు....” అన్నాడు గురువులు.

అందరూ కాసేపు నిశ్శబ్దం వహించారు.

ప్రెసిడెంటు కాసేపు ఆగి యిలా అన్నాడు. “మాకు తెలియని చోటు గురించి మమ్మల్నడిగితే మేమేం చెప్పేది. ఆ అడవిదారి అత్యంత ప్రమాదకరమైనది. అందులోకి వెళ్ళినవారు ప్రాణాలతో తిరిగి రాలేదు. మీ బాధ భరించలేక మాకు తోచిన తప్పుదారి యేదైనా చూపిస్తే మీరా దారిని వెళ్ళి చస్తారు. అది అమానుషంగా భావించి ఇంతవరకూ ఆ పని చేయడంలేదు. మీరు మరీ బలవంతపెడితే మేమింక ఆ పనే చేయాల్సి వుంటుంది.”

“మీరు చెప్పినదారి పట్టుకుని ప్రమాదాల్లో ఇరుక్కోడానికి గురువులేమంత మూర్ఖుడు కాదు. ప్రయాణంలో మీ కత్యంత ప్రియమైనవారు, అసహాయులు వస్తారు” అంటూ నవ్వాడు గురువులు.

"అంటే?"

"బాలురగానీ, బాలికలుగానీ...."

మళ్లీ కాసేపు యెవ్వరూ మాట్లాడలేదు.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ మునసబు యిలా అన్నాడు— "మాకు తెలియని రహస్యం మమ్మల్ని అడుగుతున్నావ్. చెప్పలేక పోవడం మా తప్పుకాదు. అందుకు నువ్వేం చేయదల్చుకున్నావో చెప్పు. విని ఆనందిస్తాము."

"విని ఆనందించే మాట కాదది. అయినా ఈ గురువులు చేయదల్చుకున్నది నోటితో చెప్పడు. చేసి చూపిస్తాడు."

"చేస్తూంటే చూడటానికిక్కడెవ్వరూ గాజులు తొడుక్కు కూర్చోలేదు" అన్నాడో భూస్వామి కోపంగా. ఆయన కళ్ళు ఎర్రబడ్డాయి.

"పోనీ-అలా గాజులు తొడిగించుకుని కూర్చున్నవాళ్ళ జోలికే వెడతాను" అన్నాడు గురువులు.

అతడి మాటలకు ప్రెసిడెంటు ఉలిక్కిపడ్డాడు. ఏమిటి గురువులు అన్నమాటలకు అర్థం? ఇక్కడున్న పదిమందిలో గాజులు తొడిగించుకూర్చున్న వాళ్ళు కొందరున్నారనా? లేక....లేక....ఇతను ఆడవాళ్ళ జోలికెడతాడా? ఈ ఆలోచన రాగానే ప్రెసిడెంటు అనుమానంగా గురువులు వంక చూశాడు.

గురువులు కళ్ళలో పట్టుదల కనబడుతోంది. ఏమైనా చేయగల ధైర్యం అతనికుందని ఆ కళ్ళనుచూసి తెలుసుకోవచ్చు. "నీలాంటి మనిషి తటస్థపడతాడని-నేను జన్మలో అనుకోలేదు—" అనుకున్నాడు ప్రెసిడెంట్ మనసులో.

అందరూ నిశ్శబ్దంగా వున్నారు. ఆఖరుకు ఓ భూస్వామి లేచినిలబడి-"ఇతను మాటలు మీరుతున్నాడు.

తుదముట్టించడం మినహా చేయగలిగిందేమీ లేదు—" అన్నాడు.

"ఇలాంటి ఆలోచనలు మీకొస్తాయని నాకెప్పుడో తెలుసు. మీలో దమ్ములున్నవాళ్ళు రొమ్ము చరిచి నా ముందుకు రండి. నా తడాఖా చూపిస్తాను" అన్నాడు గురువులు. ఇప్పుడతని ముఖంలో ఆవేశం చోటు చేసుకుంది.

గురువులు సవాలుకు నలుగురయిదుగురు ఆవేశపడ్డారు. కానీ ప్రెసిడెంటు అందర్నీ వారించి—"ఈ ప్రదేశంలో హింసాకాండ నేను భరించలేను. ఎప్పుడైనా చీడపురుగు యెదురయితే దాన్ని నలిపేయడం తప్పని నేను అనుకోను. కానీ యెంతటి దురాత్ముడికీ ఒక అవకాశమివ్వడం మంచిది. కాబట్టి గురువులూ! నువ్వు మాకిచ్చిన గడువు తీరిపోయింది. ఇప్పుడు నేను నీకు చెప్పబోయే దేమిటంటే ఒకే ఒక్క రోజు గడువిస్తున్నాను. ఈ వూరు వదిలిపెట్టి వెళ్ళావా సరేసరి. లేకపోతే నల్లిని రాచినట్లు రాచిపారేస్తాను. నా సంగతి నీకింకా తెలియదు" అన్నాడు.

"అయితే మిమ్మల్నిక దేవుడుకూడా రక్షించలేడు. ఈ గురువులు కురుక్షేత్ర మహా సంగ్రామాని కిప్పుడే శంఖం పూరిస్తున్నాడు. సిద్ధపడండి!" అన్నాడు గురువులు.

* * *

ఒక రాత్రివేళ రామం "అబ్బా!" అని బాధగా అరిచాడు. గురువులు ఉలిక్కిపడి లేచాడు. లైటు వేసిచూసి "ఏమయింది రామం!" అన్నాడు.

"నొప్పి!" అన్నాడు రామం మెలికలు తిరిగిపోతూ.

గురువులు కంగారు పడ్డాడు. ఇక్కడ తమకు విష ప్రయోగం జరిగే అవకాశ మున్నదని అతనికి బాగా అనుమానంగా వుంది. అందుకే భోజనం విషయంలో ఎన్నో

జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. రామాన్నికూడా హెచ్చరించాడు.

కానీ తామిద్దరమూ యెక్కువకాలం కలిసి వుండటం లేదు. తను సమయాన్ని యెక్కువగా శ్రామికులతో గడుపుతున్నాడు. రామం పెద్దమనుషులతో గడుపుతూ వున్నాడు. ఆ సమయంలో యెప్పుడైనా తొందరపడి కక్కుర్తి పడితే?

గురువులు, రామాన్ని సమీపించి పొట్ట నిమురుతూ "యెలావుంది రామం?" అన్నాడు.

"భరించలేక పోతున్నాను. చచ్చిపోతానేమోనని భయంగావుంది" అన్నాడు రామం. అతను స్థిరంగా వుండలేక పోతున్నాడు.

గురువులు గదిలోంచి బయటకు వెళ్ళి ప్రెసిడెంటు కోసం కేక పెట్టాడు. కొద్దిసేపట్లో ఆయన వచ్చాడు. అప్పటికికూడా రామం యింకా మెలికలు తిరిగిపోతూనే వున్నాడు.

అతని అవస్థ నూస్తూంటే ప్రెసిడెంటుకు అది వొంగ నొప్పి కాదేమోనని అనుమానం వచ్చింది. అతడు కదిలే విధానం, ముఖంలో కనిపించేబాధ చాలా సహజంగా వున్నాయి.

"ఏం జరిగింది?" అన్నాడు ప్రెసిడెంటు.

"కడుపునొప్పి అనుకుంటాను" అన్నాడు గురువులు— "త్వరగా డాక్టర్ని పిలిచి సరయిన వైద్యం జరిపించండి."

"ఇంత రాత్రి సమయంలో యే డాక్టరొస్తాడు? ప్రొద్దుటదాకా ఆగితే...."

"ప్రెసిడెంటుగారూ రోగులకూ, డాక్టరుకూ టైము

పట్టింపులుండవు. వెంటనే పిలిపించండి" అన్నాడు గురువులు.

ప్రెసిడెంటు తన పాలేర్ని లేపడానికి వెడుతూ, తప్పనిసరి అయి వెడుతున్నట్లుగా యిబ్బంది మొహం పెట్టాడు.

గురువులు రామాన్ని సమీపించి, "రామం యేమైందో చెప్పు. నువ్వుగానీ పొరపాటున ప్రెసిడెంటు యింట్లో యేమైనా తినలేదు గదా" అన్నాడు.

రామం అడ్డంగా తలవూపి—"రాదలచి వచ్చిన నొప్పి యిది. ఉండుండి కడుపులో శూలాలతో గుచ్చినట్లు బాధ. ఈబాధ భరించడం కంటె ప్రాణాలు పోతే హాయిగా వుంటుందనిపిస్తోంది" అన్నాడు.

గురువులు కళ్ళలో ధైర్యం చోటుచేసుకుంది. రామానికి యేమీ కాకూడదని అతను మనసులో కోరుకొంటున్నాడు. తన గొడవలోపడి రామాన్ని అశ్రద్ధ చేశాననీ, అతన్ని అన్ని వేళల్లోనూ తన వెంటబెట్టుకునే వుండవలసిందనీ అనుకుంటూ, ఆ మాటలే రామంతో అన్నాడు.

"భగవంతుడి దయవల్ల నీకీ గండం గడిస్తే-ఇక నిన్నొక్క క్షణంకూడా వదలను. అనుక్షణం నిన్నంటిపెట్టుకుని కంటికి రెప్పలా కాపాడుకుంటాను" అన్నాడు గురువులు.

రామంపై ఆ మాటలు వింత ప్రభావాన్ని చూపించాయి. గురువులలా అనకుండా ఉండివుంటే బాగుండునని అతనికి అనిపించింది. హృదయంలేని హంతకుడుగా గురువుల్ని తను భావిస్తున్నాడు. అందుకే అతనికి న్యాయం తల పెడుతున్నాడు. ఆ గురువులు తనని సోదరుడిలా అభిమానిస్తుంటే అది మనఃపూర్వకమైన అభిమానమే అయితే తన మనసు తను చేస్తున్న తప్పుకు తన్ను క్షమించదు.

(సశేషం)